


# కరపత్రం

SINCE 2014

శనివారం నవంబర్ 02 2024 | సంపుటి :0 | సంచిక : 24 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## మెమోస్ మృతి కేసులో ఆరుగురి అరెస్ట్

కల్తీ పదార్థాలే కారణమని గుర్తింపు



మెమోస్ తిని ఓ గృహిణి చనిపోయిన కేసులో పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. హైదరాబాద్ చింతల్ బస్తీలో మెమోస్ తయారు చేస్తున్న అల్మాస్‌ను అరెస్టు చేశారు.

మిగతాది 2లో



## అనలాగ్ స్పేస్ మిషన్‌ను ప్రారంభించిన ఇస్రో

- ఇస్రో ప్రారంభించిన తొలి భారీ అనలాగ్ మిషన్ ఇదే
- బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు సన్నాహాలు

మిగతాది 2లో

# తెలంగాణ సచివాలయం భద్రత బాధ్యతలు స్వీకరించిన ఎస్పీఎఫ్

తెలంగాణ సచివాలయం భద్రత బాధ్యతలను తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీ ఎఫ్) స్వీకరించింది.




హైదరాబాద్: తెలంగాణ సచివాలయం భద్రత బాధ్యతలను తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) స్వీకరించింది. ఎస్పీఎఫ్‌నకు చెందిన 214 మంది ఈ రోజు నుంచి సచివాలయం భద్రత బాధ్యతలు చేపట్టారు. గేట్లు, ఇతర ప్రాంతాల్లో సాయుధ గార్డు, లోపల గస్తీ వంటి బాధ్యతలను ఎస్పీఎఫ్‌నకు ప్రభుత్వం అప్పగించింది. ఎస్పీఎఫ్ కమాండెంట్ దేవీదాస్ నేతృత్వంలో భద్రత సిబ్బంది ఇవాళ సచివాలయం ఆవరణలో పూజలు నిర్వహించి బాధ్యతలను స్వీకరించారు.

సచివాలయం ప్రారంభించిన తర్వాత మొదట్లో ఎస్పీఎఫ్ భద్రత నిర్వహించింది. గతేడాది ఏప్రిల్ 25న భద్రత నిర్వహణను తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ)కు అప్పగించారు. అయితే భద్రతతోపాటు అగ్నిప్రమాదాల నుంచి రక్షణ వంటి పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఎస్పీఎఫ్‌నకు సచివాలయం భద్రత బాధ్యతలు అప్పగించాలని ఆగస్టు 5న ప్రభుత్వానికి డీజీపీ ప్రతిపాదించారు. డీజీపీ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం భద్రత బాధ్యతలను టీజీఎస్పీ నుంచి తీసుకోవాలని ఎస్పీఎఫ్‌ను ఆదేశించింది.

## వికారాబాద్ జిల్లాలో దారుణ ఘటన

మైనర్ బాలికపై నలుగురు మైనర్ల లైంగికదాడి



వికారాబాద్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఎనిమిదో తరగతి చదవుతున్న 13 ఏళ్ల బాలికపై 4గురు మైనర్లు లైంగిక దాడికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలిస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ముబావంగా ఉన్న బాలికను తల్లిదండ్రులు ప్రశ్నించడంతో జరిగిన ఘోరాన్ని వివరించింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నలుగురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ



మిగతాది 2లో

## కాంగ్రెస్ కమిషన్‌లా బిసి కమిషన్

కమిషన్ విచారణకు హాజరైనా సమయమివ్వలేదు
బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శలు



2లో

## ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత

- రైతులను నట్టేముంచి ..డైవర్షన్ పాలిటిక్స్
- వ్యతిరేతను ప్రజల్లోకి తీసుకుని వెళ్లే ఆలోచన
- అవసరమైతే పాదయాత్ర చేస్తామన్న కెటిఆర్



ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉందని, రాజకీయంగా తమకు అనుకూలంగా ఉందిన విపక్ష బిఆర్ఎస్ భావిస్తోంది. దీనిని తమకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లాలని నిర్ణయించింది. ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా కెటిఆర్ పాదయాత్ర ఆలోచన చేస్తున్నారు. అలాగే కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని కేటీఆర్ అన్నారు. ఎక్స్ వేదిగా నిర్వహించిన 'ఆస్క్ కేటీఆర్' క్యాంపెయిన్‌లో యూజర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. దేశంలోని అనేక పార్టీల నేతలు ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు, పార్టీలను బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షులు పాదయాత్రలు చేస్తున్నారు, మీరెప్పుడు చేస్తారని అడిగారు. దీనికి స్పందించిన కేటీఅర్ ఖచ్చితంగా తన పాదయాత్ర ఉంటుందని వెల్లడించారు. దాదాపు గంటన్నపాటు సాగిన ఈ సంభాషణలో కేటీఆర్ అనేక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పాలన తెలంగాణకు ఒక శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ఉద్దేశం ఏమాత్రం లేదు. అందుకే అబద్దాలు, అసత్యాల మీద సమయం గడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నది. గత పది నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఒక్క మంచి కూడా గుర్తుకు రావడం లేదు. అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేం. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ వేధింపులను ప్రారంభించింది. అయితే వీటికి భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. సన్నవడ్లకు కూడా బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరఫున పోరాడుతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ డీల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. నాలుగేండ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం పోవడం ఖాయమని కేటీఆర్ అన్నారు. అయితే కొత్త ప్రభుత్వానికి ప్రస్తుత సర్కార్ చేసిన నష్టం నుంచి తెరుకొని ముందుకు తీసుకుపోవడం అతిపెద్ద సవాలుగా మారుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనమైందని చెప్పారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయ వనరులు నుంచి మొదలు వ్యవసాయ రంగం, అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగిత పెరిగిందన్నారు.



2లో

## చందానగర్ పరిధిలో భారీగా డ్రగ్స్ పట్టివేత

- డ్రగ్స్ విలువ రూ.18 లక్షలు ఉంటుందన్న పోలీసులు

హైదరాబాద్ శివారు చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. నిందితుడి నుంచి 155 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు.



## టిజి ఆర్టీసీ మరో కీలక నిర్ణయం

- కార్గో సేవల విస్తరణపై దృష్టి
- పార్శిళ్లు నేరుగా ఇంటికి చేర్చనున్నట్లు ప్రకటన

2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం నవంబర్ 02 2024

## చందానగర్ పరిధిలో భారీగా డ్రగ్స్ పట్టివేత

మొదటిపేజీ తరువాయి

పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.18 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన కృష్ణారామ్ గురువారం హైదరాబాద్‌కు వచ్చాడు. తనతో పాటు ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు లింగంపల్లి గుల్ మోహర్ పార్క్ వద్ద ఇంట్లో తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని చందానగర్ పోలీసులకు అప్పగించారు. నిందితుడు కృష్ణారామ్‌తో పాటు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నారు. మెయిన్ పెడ్లర్ కృష్ణారామ్‌కు నిందితులు లోదారం రామ్, విక్రమ్ సింగ్, పునిత్, సమీర్ రామ్ సింగ్ డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని చందానగర్ సీఐ పాలవెల్లి తెలిపారు. ఈ కేసులో నిందితులైన సమీర్, లోదా రామ్‌ను చౌటుప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఆ ఇద్దరినీ పీటీ వారెంట్‌తో అదుపులో తీసుకొని విచారిస్తామని చెప్పారు. కృష్ణారామ్ స్నేహితుడు రూపారాం డ్రగ్స్ గురించి పోలీసులకు సమాచారం ఇచ్చాడన్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు సీఐ వివరించారు.

## టిజి ఆర్టీసీ మరో కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ నిర్వహిస్తున్న కార్గో సేవల ద్వారా బుక్ చేసుకున్న పార్శిళ్లను నేరుగా హోమ్ డెలివరీ చేయాలని నిర్ణయంచింది. దీపావళి పండగ సందర్భంగా అక్టోబర్ 31వ తేదీ నుంచి ఈ సేవలను ప్రారంభించింది. ఈ సేవలు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. అలాగే ఈ సేవల ద్వారా బుక్ చేసుకునే పార్శిళ్లకు కేజీల బట్టి రుసుం వసూల్ చేస్తామని వివరించింది. కేజీ నుంచి ఐదు కేజీల వరకు రూ. 50. అలాగే కేజీ బరువు దాటిన నాటి నుంచి ఐదు కేజీల వరకు రూ. 60. ఐదు కేజీల నుంచి 10 కేజీల వరకు రూ. 65. పది కేజీలపై నుంచి 20 కేజీల వరకు రూ. 70. 20 కేజీలపై నుంచి 30 కేజీల వరకు రూ. 75 వసుల్ చేస్తామని టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. కార్గో సేవలతో టీజీఎస్ఆర్టీసీకి మంచి లాభాలు వచ్చాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాగే ఈ కార్గో సేవల వలే... పార్శిళ్ల సేవలతో హోమ్ డెలివరీ చేస్తే.. సంస్థకు మరింత ఆదాయం వస్తుందని టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పేరిట మహాలక్ష్మీ పథకం అమలు చేస్తుంది. ఈ పథకం వల్ల సంస్థకు నష్టం వస్తుందనే ప్రచారం ఉన్నా ప్రాచుర్యం పొందింది. ఈ క్రమంలో సంస్థ వివిధ మార్గాల్లో ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. అందులోభాగంగా పార్శిళ్లను హోమ్ డెలివరీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అలాగే వివిధ ప్రాంతాల నుంచి రాత్రి సమయంలో నగరానికి చేరుకునే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి సమస్యలు ఎదుర్కొనే వారు.. 040 69440000, టోల్ ఫ్రీ నెంబర్ 8008432929, 040-30102829 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చని ఆర్టీసీ అధికారులు సూచిస్తున్నారు. ఇలా ఫిర్యాదు చేయడం వల్ల ఆ యా మార్గాల్లో రాత్రి వేళ్లలో బస్సుల సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని వివరిస్తున్నారు.

## మెమోస్ మృతి కేసులో ఆరుగురి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి

అస్వస్థతకు కలుషితమైన మోమోస్ కారణమా.. లేక అందులో వినియోగించిన మయోనైస్ కారణమా అనేది నివేదిక వచ్చాక తెలుస్తుందని అధికారులు వివరించారు. మరోవైపు.. కలుషిత మోమోస్ కేసులో బంజారాహిల్స్ పోలీసులు మరో ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వీరంతా ఢిల్లీ మోమోస్ నుంచి ఆహార పదార్థాలను కొనుగోలు చేసి.. సంతల్లో విక్రయిస్తుంటారని పోలీసులు వివరించారు. బీహార్ నుంచి వచ్చిన అల్మాస్.. చింతల బస్తీలో మెమోస్ తయారు చేస్తున్నాడు. మెమోస్ తయారీకి నాసిరకం పదార్థాలు వాడడంతో ప్రమాదం సంభవించిందని గుర్తించారు. నాసిరకంతో పాటు అపరిశుభ్రత విష పదార్థంగా మెమోస్ మారింది. బంజారా హిల్స్‌లో వారాంతపు సంతలో పెట్టిన మెమోస్‌ను రేష్మ బేగం అనే మహిళ తిన్న వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆసుపత్రికి తరలించే లోపే ఆమె చనిపోయింది.

కలుషిత మోమోస్ కారణంగా రేష్మ మృతి చెందగా.. మరో 50 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. మూడు రోజుల క్రితం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 110 మోమోస్ తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి, తనిఖీ చేపట్టారు. అనుమతులు లేకుండా.. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మోమోస్‌ను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. పురుగులు పట్టిన మైదా పిండి, కాలం చెల్లిన ముడిపదార్థాలను మోమోస్ తయారీకి వినియోగిస్తున్నట్లు నిర్ధారించారు. కొన్ని తయారీ కేంద్రాల్లో అపరిశుభ్రత, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో వంటి పరిస్థితులను గుర్తించారు. 69 కేంద్రాల్లో మోమోస్ నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్ నుంచి నివేదిక వచ్చాక.. సంబంధిత మోమోస్ తయారీ కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ ఎస్.పంకజ వెల్లడించారు.

# ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ నుంచి అనేక కంపెనీలు వెనక్కి వెళ్లిపోతున్నాయని చెప్పారు. ఈ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో ఎవరికీ తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ పాలన వలన జరుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవడం అప్పుడప్పుడే సాధ్యం కాదు అన్నారు. కాంగ్రెస్ దళారీ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని కేటీఆర్ ఆరోపించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవడం, పంట కొనుగోళ్లపై ఆయన స్పందించారు. వానాకాలం వరికోతలు సాగుతున్నప్పటికీ.. రైతుబంధు, రైతుభరోసా ఊసే లేదని ఆక్షేపించారు. కనీసం పంట కొనుగోలు చేయడం లేదని.. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలకు చాలాచోట్ల కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసిందని పేర్కొన్నారు. ఈ సీజన్లో 91 లక్షల 28 వేల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి.. అక్టోబర్ 28 వరకు 913 మంది రైతుల నుంచి కేవలం 7,629 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. 'రైతన్న అంటే ఎంత నిర్లక్ష్యమో చూడండి' అని వ్యాఖ్యానించారు. దళారులతో కుమ్మక్కైన కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయడం లేదని.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మిల్లుల కేటాయింపు జరగలేదని కేటీఆర్ విమర్శించారు. సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపాలో తెలియక ఐకేపీ కేంద్రాల్లోను కొనుగోలు ప్రక్రియ నిలిచిందన్నారు. కనీసం పండించిన చేసిన పంటను కొనుగోలు కూడా చేయడం లేదని.. ఫలితంగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు చాలా చోట్ల కల్లాలలో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసి ముద్దయ్యిందని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 91.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామన్నారని.. అక్టోబర్‌లో నెలలో 8.16 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుందని గుర్తు చేశారు. అక్టోబర్ 28 నాటికి వరకు 913 మంది రైతుల నుంచి కేవలం 7,629 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని.. దాన్ని బట్టి రైతన్న అంటే ఎంత నిర్లక్ష్యమో ప్రజలు చూడాలన్నారు. దళారులతో కుమ్మక్కు అయిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని.. నేటి వరకు పూర్తి స్థాయిలో మిల్లుల కేటాయింపు జరగనేలేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపాలో తెలియక.. ప్రారంభించిన ఐకేపీ కేంద్రాల్లోను కొనుగోలు ప్రక్రియ నిలిచిందన్నారు. రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెడుతుంటే... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం డైవర్షన్ పాలిటిక్స్‌లో బిజీబిజీగా ఉన్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపంగా మారిందని ఆయన అన్నారు. ప్రస్తుత పాలన ఫ్రం ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢిల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యమని చెప్పారు. ప్రజలపక్షాన కొట్లాడటమే ప్రస్తుతం తమముందున్న బాధ్యత అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భారాస తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. 'పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున కచ్చితంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతస్థాయి పాదయాత్ర నిర్వహిస్తానని అన్నారు. కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. పార్టీకీ మార్గదర్శనం చేస్తున్నారు. పార్టీ నేతలపై వేధింపులు,అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. మా సోషల్ మీడియా వారియర్లు అద్భుతంగా పని చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. తాము అధికారంలో ఉన్న పదేండ్లలో ఏనాడూ ఇతరుల కుటుంబ సభ్యులను రాజకీయ అంశాల్లోకి లాగలేదు. దాదాపు రెండు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో కుటుంబ సభ్యులను అవహేళన చేసి మాట్లాడినప్పుడు, రాజకీయాలు వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురైన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కేవలం రాజకీయాల కోసం ఇతరుల కుటుంబ సభ్యులను ఎందుకు లాగుతారో అర్థంకాదని, ఈ విషయం తనకు అత్యంత బాధ కలిగిస్తుందన్నారు.

నీచమైన రాజకీయాల కోసం తన కుటుంబాన్ని లాగుతున్న ముఖ్యమంత్రి పైన, ఆయన వందిమాగదుల పైన ప్రజల మద్దతుతో పోరాటం చేస్తానని చెప్పారు. చెరువుల సంరక్షణ పేరుతో ప్రభుత్వం పేపర్ మీద గొప్పలు చెబుతున్నప్పటికీ అసలైన ఎజెండా అవినీతి మాత్రమే. మూసీ బ్యూటిఫికేషన్‌కి తాము వ్యతిరేకం కాదు. కానీ మూసీ లూటిఫికేషన్‌కి వ్యతిరేకం. మూసీ ప్రక్షాళణ దేశంలోనే అతిపెద్ద అవినీతి స్కాం అవుతుంది. హైడ్రా కేవలం కొందరిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని పనిచేస్తుంది. ఇప్పటిదాకా ఒక్క పెద్ద బిల్డర్‌ని కూడా హైడ్రా ముట్టుకోలేదు. కేవలం పేదలను మధ్యతరగతి ప్రజలను మాత్రమే నిర్ధయగా దోచుకున్నదని కెటిఆర్ దుయ్యబటటారు.

# భారీగా పెరిగిన ఆదాయం.. భారత్‌లో మరో నాలుగు స్టోర్లు

### యాపిల్ సంస్థ సీఈవో టిమ్ కుక్

భారత్‌లో యాపిల్ ఐఫోన్ల విక్రయాలు ఊపందుకున్నాయి. ముంబై, ఢిల్లీలో ఉన్న రెండు స్టోర్ల ద్వారా భారీగా ఆదాయం సమకూరుతోంది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీకి ఐఫోన్ విక్రయాల ద్వారా భారత్ నుంచి వస్తోన్న ఆదాయం గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో దేశవ్యాప్తంగా ఐఫోన్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే మరో నాలుగు స్టోర్లను ప్రారంభించనున్నట్లు సంస్థ సీఈవో టిమ్ కుక్ తాజాగా ప్రకటించారు. 'మొదటి త్రైమాసికంలో రెండు కొత్త స్టోర్‌లను ప్రారంభించాం. ఢిల్లీ, ముంబైలో ఈ అవుట్‌లెట్లను ఏర్పాటు చేశాం. త్వరలోనే భారత్ కస్టమర్లకు నాలుగు కొత్త స్టోర్‌లను తీసుకురాబోతున్నాం' అని యాపిల్ సీసీవో వెల్లడించారు. కాగా, కొత్త స్టోర్లను ఏయే నగరాల్లో ప్రారంభిస్తారన్న విషయాన్ని మాత్రం టిమ్ కుక్ వెల్లడించలేదు. అయితే, పుణె, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైలలో కొత్త స్టోర్లను నెలకొల్పనున్నట్లు యాపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డియర్డ్రి ఓబ్రియాన్ ఇటీవలే తెలిపిన విషయం తెలిసిందే. ఇక ప్రస్తుతం భారత్‌లో రెండు యాపిల్ స్టోర్లు మాత్రమే ఉన్న విషయం తెలిసిందే. ఒకటి ముంబైలోని బీకేసీలో ఉండగా.. మరొకటి ఢిల్లీలోని సాకేత్‌లో ఉంది. వీటిని 2023లో యాపిల్ అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలను యాపిల్ తాజాగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఐఫోన్ విక్రయాలు



భారీగా పెరిగి ప్రపంచ రికార్డులను నెలకొల్పినట్లు సీఈవో టిమ్ కుక్ ఈ సందర్భంగా తెలిపారు. కంపెనీ రెవెన్యూ గతంలో కంటే 6 శాతం పెరిగి 94.9 బిలియన్ డాలర్లు అంటే రూ.7.9 లక్షల కోట్లుకు చేరినట్లు తెలిపారు. 'యాపిల్ తాజా త్రైమాసిక ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఆదాయాన్ని నమోదు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా భారీగా ఐఫోన్ అమ్మకాలు జరిగాయి. యూఎస్, యూరప్, బ్రెజిల్, మెక్సికో, ఫ్రాన్స్, బ్రిటన్, కొరియా సహా పలు దేశాల్లో రికార్డు స్థాయిలో ఆదాయం అర్జించింది. ప్రత్యేకించి భారతదేశంలో యాపిల్ ఐఫోన్ సేల్స్ గరిష్ఠాలను చేరుకున్నాయి. భారత్ నుంచి వచ్చే ఆదాయం సరికొత్త రికార్డును నెలకొల్పింది' అని టిమ్ కుక్ వెల్లడించారు.

## మహారాష్ట్రలో ఎలాంటి గ్యారంటీలను అమలు చేయడం లేదు

### గ్యారంటీల అమలుతో రాష్ట్రం దివాలే

### మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు



కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు, ఏడు అంటూ ఎలాంటి గ్యారంటీలూ ప్రకటించడం లేదని స్పష్టం చేశారు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలని.. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుందని వ్యాఖ్యానించారు. విలేకరులతో ఖర్గే మాట్లాడుతూ.. 'త్వరలో జరగబోయే మహారాష్ట్ర ఎన్నికల్లో 5, 6, 10, 20 ఇలా ఏ ఒక్క హామీలను ప్రకటించడం లేదు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలి. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుంది. ప్రణాళికా రహిత విధానం ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తుంది. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే.. భవిష్యత్తు తరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే.. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారు. ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తు తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదు' అంటూ ఎన్నికల హామీలపై ఖర్గే వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు పలు హామీలను ఇస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటకలో ఐదు గ్యారంటీలతో, తెలంగాణలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చింది. అయితే, గ్యారెంటీల పేరుతో ఆకర్షించి ఓట్లు వేయించుకున్న ఆ పార్టీ ఇప్పుడు ఉచిత పథకాలను అమలు చేయలేక చేతులెత్తేస్తున్నది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన నెల రోజులకే ఆడంబరంగా ప్రారంభించిన ఉచిత బస్సు పథకానికి ఏడాదిన్నరకే మంగళం పాడేందుకు సిద్ధమైంది. ఈ పథకాన్ని నిలిపేసేందుకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. తెలంగాణలో సైతం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో హస్తం పార్టీ విఫలమవుతోందని విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హామీలపై కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేస్తున్నట్లు తెస్తోంది.

# కాంగ్రెస్ కమిషన్‌లా బిసి కమిషన్

మొదటిపేజీ తరువాయి

బీసీ కమిషన్ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌లా తయారైందని ఆరోపించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్‌ను కోరాం. భారాస తప్ప ఇతర పార్టీల నుంచి ఎవరూ రాలేదు. కాంగ్రెస్, భాజపా నేతలు ఎందుకు రాలేదు? కొత్త కమిషన్ వేయాలని కోర్టు చెప్పిన తర్వాత అభిప్రాయ సేకరణ ఎందుకని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు.స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిషన్ మీద ఉన్న గౌరవంతో ఇక్కడికి వస్తే మాట్లాడేందుకు సమయం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా కమిషన్ ముందుకు రాలేదని, కమిషన్ మీద కాంగ్రెస్‌కు నమ్మకం లేదు కాబట్టే ఎవరు రాలేదని ఎద్దేవా చేశారు. డెడికేటెడ్ కమిషన్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాల్నారు. కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు ప్రజలు అభిప్రాయాలు చెప్పేందుకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ కొనసాగనున్నది. వచ్చే నెల 13 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టనున్నది.కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా కరీంనగర్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణకు రాలేదని భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. బహిరంగ విచారణలో ఆయనతో పాటు భారాస నేతలు నిరసన తెలిపారు. కమిషన్ మీద కాంగ్రెస్ నేతలకు నమ్మకం లేనందునే ఎవరూ రాలేదన్నారు. 'బీసీ కమిషన్‌కు విలువ లేదని హైకోర్టు చెప్పింది. దాని మీద ఉన్న గౌరవంతో ఇక్కడికి వచ్చాం. కానీ మాకు మాట్లాడటానికి సమయం కూడా ఇవ్వలేదన్నారు.

## అనలాగ్ స్పేస్ మిషన్‌ను ప్రారంభించిన ఇస్రో

మొదటిపేజీ తరువాయి


భారత అంతరిక్ష సంస్థ ఇస్రో తొలి అనలాగ్ స్పేస్ మిషన్‌ను లద్దాఖ్ లేహ్‌లో ప్రారంభించింది. హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్, ఆకా స్పేస్ స్టూడియో, లడఖ్ విశ్వవిద్యాలయం, ఐఐటీ బాంబే, లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో ఈ మిషన్ చేపట్టింది. మిషన్‌లో భాగంగా ఇస్రో లేహ్‌లో ఓ స్పేస్‌ను సృష్టిస్తుంది. ఇందులో మరో గ్రహంలో పరిస్థితులు ఎలా ఉంటాయో అలాగే ఉంటాయి. దాంతో భూమికి దూరంగా ఉన్న ప్రదేశాల్లోని బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఇస్రో సన్నాహాలు చేయనున్నది. ఇస్రో లేహ్‌లో ప్రారంభించిన తొలి భారీ అనలాగ్ మిషన్ మిషన్ ఇదే. అంతరిక్షం, ఏదైనా ఖగోళ వస్తువు తరహాలో వాతావరణం, పర్యావరణాన్ని పోలి ఉంటుంది. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శాస్త్రవేత్తలు తీర్చిదిద్దుతుంటారు. అందులో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. రాబోయే రోజుల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కీలకమైన మిషన్లు చేపట్టనున్న విషయం తెలిసిందే. ఇందులో కీలకమైన మిషన్ గగన్‌యాన్. ఇందులో మిషన్‌లో తొలిసారిగా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపబోతున్నది. ఈ పరిస్థితుల్లో అనలాగ్ మిషన్ కీలకంగా మారనున్నది. రాబోయే కాలంలో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. లద్దాఖ్‌లోని వాతావరణ పరిస్థితులు కొంత వరకు చంద్రుడు, మార్స్ పరిస్థితులను పోలి ఉంటాయి. చల్లని, పొడి వాతావరణం, ఎక్కువ ఎత్తు ఉండడంతో ఇక్కడి నుంచి దీర్ఘకాలిక అంతరిక్ష మిషన్ల కోసం సన్నాహాలకు ఉపయుక్తంగా ఉండనున్నది. అనలాగ్ మిషన్‌లో పాల్గొనేవారంతా ఇతర గ్రహాలు, స్పేస్‌షిప్‌ల్లో ఉండే పరిస్థితులు అనుభవిస్తారు. భవిష్యత్‌లో ఇక్కడే అంతరిక్ష యాత్రకు సిద్ధం కానున్నారు. నిర్వహణ, మానసిక స్థితిని సైతం శాస్త్రవేత్తలు పర్యవేక్షించనున్నారు.

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

మొదటిపేజీ తరువాయి

ఏడుకొండలస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టీబీసీ గెస్ట్‌హౌస్ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 63,987 మంది భక్తులు దర్శించుకోగా 20,902 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు మొక్కుల ద్వారా సమర్పించుకున్న కానుకల ద్వారా శ్రీవారికి రూ. 2.66 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## భారాస పదేళ్లలో చేయలేని అభివృద్ధిని.. పదినెలల్లో చేశాం : మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్: తెలంగాణలో పదేళ్ల పాలనలో భారాస చేయలేని అభివృద్ధిని.. తాము పది నెలల కాలంలో చేశామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో సుమారు రూ.6.68 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బోడుప్పల్‌లో వక్ఫ్ బోర్డు సమస్య న్యాయస్థానం పరిధిలో ఉందని.. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అధికారంలోకి రాగానే మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వకుండా, తమ బంధువులకు, కార్యకర్తలకు ఇచ్చారని ఆరోపించారు. అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. రూ.13 కోట్లతో బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని చెరువుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.10 లక్షలతో పేదలకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు కోసం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల 5వేల ఉద్యోగాలు ఇస్తున్నామని, ఇప్పటి వరకు 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు.

## ఇందిరా స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడుస్తుంది... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్



**కరపత్రం బాన్సువాడ నవంబర్ 1**
బాన్సువాడ పట్టణంలోని తాడుకోల్ చౌరస్తాలో గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి



ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి ఎన్నో సేవలు చేశారని, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనునిత్యం పాటుపడిన మహా నాయకురాలన్నారు. ఇందిరా గాంధీ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3500 పేద బడుగు బలహీన వర్గాలకు ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనునట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను 100% నెరవేరుస్తుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేశామని, కొన్నిచోట్ల లబ్ధిదారుల వివరాల జాప్యం వల్ల ఆలస్యమైన అందరికీ రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఖలేఖ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్ బిన్ మోసీన్, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి,,ఎజాస్,బాబా, షాహబ్ ,రాయిస్ , అఫ్రోజ్ ,మన్నన్, కొట్టం గంగాధర్,మాసాని రవీందర్ రెడ్డి, గొల్ల వెంకన్న యాదవ్, పోతిరెడ్డి, బిట్ల సురేందర్, నార్ల ఉదయ్, మోహిన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఆర్టీసీ డిపోలో ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం



**కరపత్రం బాన్సువాడ నవంబర్ 1**
బాన్సువాడ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏక్తా దివాస్లో భాగంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ఆయన చిత్రపటానికి



పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దీపావళిని పురస్కరించుకొని మహాలక్ష్మి దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జానాభాయి, డిప్యూటీ సూపర్డెంట్ బసంత్, జగదీశ్వర్, రామస్వామి, సామ్రాజ్యం, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడలో ఇందిరాగాంధీ విగ్రహానికి



## నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

**కరపత్రం బాన్సువాడ నవంబర్ 1**
బాన్సువాడ పట్టణంలో గురువారం ఇందిరా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ఆదేశానుసారం కాంగ్రెస్ నాయకులు ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడి, దేశ ప్రజల్లో తనదైన ముద్రను వేశారని ఇందిరాస్ఫూర్తితో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి ఎన్నో సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు మాసాని శేఖర్ రెడ్డి, మంత్రి గణేష్, మాజీ జడ్పిటిసి కొత్తకొండ భాస్కర్, నాయకులు హన్మాండ్లు, మాసాని శ్రీనివాస్ రెడ్డి, బండి సాయిలు యాదవ్, అంబర్ సింగ్, భాను గౌడ్, యూనుస్, ఆనంద్, సాయిలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీ బీబీ పాటిల్ జన్మదిన వేడుకలు

**కరపత్రం మద్నూర్ నవంబర్ 1**
మద్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం మాజీ ఎంపీ బీబీ పాటిల్ జన్మదిన సందర్భంగా బిజెపి నాయకులు ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో



మండల అధ్యక్షులు తుకారం, జిల్లా కార్యదర్శి కృష్ణా పటేల్, ఓ బి సి కన్వీనర్ సంతోష్, బాలకిషన్, ప్రవీణ్, అంజయ్య శివాజీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ లో మహిళా సమాఖ్య మహాజన సభ సమావేశం...







**కరపత్రం బోధన్ నవంబర్01..**
పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బోధన్ పట్టణ మహిళా సమాఖ్య మహాజన సభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ మహిళలు బ్యాంకుల నుండి తీసుకొన్న రుణాలను పెట్టుబడిగా పెట్టి వ్యాపారాలు ప్రారంభించి అభివృద్ధి చెందాలని అన్నారు. కోటిమంది మహిళలు కోటీశ్వరులు కావాలి అన్న ప్రభుత్వం యొక్క లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. సంఘాలలో లేని వారిని గుర్తించి కొత్త సంఘాలు ఏర్పాటు చేసి వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందేలా చేయాలన్నారు. పట్టణ మహిళా సమాఖ్య 2023-24 ఆర్థిక సంవత్సరంలో 11,38,278 రూపాయల మిగులును సాధించినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ వెంకట నారాయణ మాట్లాడుతూ మహిళా శక్తి ఎక్కడో లేరని అందుకు మీరందరు ఉదాహరణ అని పేర్కొన్నారు. సంఘాలలో ఉన్న మహిళలు అన్ని రంగాలలో ముందుకొస్తున్నారని అన్నారు. ఆర్పీలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారదిగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని కార్యక్రమాల్లో ముందుగా మహిళా సంఘ సభ్యులను ఆర్పీల చేతనే అమలు చేయిస్తున్నారని అన్నారు. మెప్మా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మాధురి లత మాట్లాడుతూ మహిళా శక్తి పథకం క్రింద మహిళలు వ్యక్తిగత, గ్రూప్ వ్యాపారాల కోసం బ్యాంకుల నుండి రుణాలు తీసుకొని సద్వినియోగం చేసుకుని సక్రమంగా తిరిగి చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా టౌన్ మిషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, స్త్రీనిధి మేనేజర్ వరలక్ష్మి, సమాఖ్యల రిసోర్స్ పర్సన్లు, పట్టణంలోని వివిధ సమాఖ్యల అధ్యక్షులు, పట్టణ సమాఖ్య పదాధికారులు పాల్గొన్నారు.

## తప్పిదాలకు తావులేకుండా పక్కాగా ఇంటింటి సర్వే







- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...
- ఇళ్ల జాబితా రూపకల్పన ప్రక్రియ పరిశీలన...



**కరపత్రం బోధన్,నిజామాబాద్, నవంబర్ 01 :**
రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక,ఆర్థిక,విద్య, ఉపాధి,రాజకీయ,కుల వివరాల సేకరణకై ప్రభుత్వం ఈ నెల 6 వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లాలో పక్కాగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి ఆయా నివాస ప్రాంతాలలో ఇళ్ల జాబితాల రూపకల్పన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమవగా,జిల్లా పాలనాధికారి క్షేత్రస్థాయి సందర్శన జరిపి ఈ ప్రక్రియను నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. బోధన్ మున్సిపల్ పట్టణంలోని రాకాసిపేట్ తో పాటు లంగ్దాపూర్ గ్రామంలో అధికారులు,సిబ్బంది ఇళ్ల జాబితా రూపకల్పన కోసం చేపడుతున్న చర్యలు,పాటిస్తున్న పద్ధతులను కలెక్టర్ పరిశీలన జరిపారు. ఇళ్లకు సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అతికిస్తూ,వాటిపై నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించిన కలెక్టర్, అధికారులకు కీలక సూచనలు చేశారు. ఏ ఒక్క నివాస గృహం సైతం మినహాయించబడకుండా పక్కా పరిశీలనతో హౌస్ లిస్టింగ్ చేయాలని,ఎలాంటి గందరగోళానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ముఖ్యంగా మున్సిపల్ పట్టణాల పరిధిలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. సర్వే కోసం ఎన్యూమరేషన్ బ్లాక్ లోని ప్రతి ఇంటికి క్రమానుగత సంఖ్యను కేటాయించాలని,ఇళ్ల జాబితా పక్కాగా రూపొందితే సర్వే సమగ్రంగా చేపట్టబడుతుందని అన్నారు. నిర్దేశిత సర్వే ప్రణాళికను అనుసరిస్తూ,మూడు రోజుల్లోపు హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎక్కడ కూడా డూప్లికేషన్ లేకుండా హౌస్ లిస్టింగ్ చేయాలని,ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ జిల్లాలో సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 06 వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఇంటింటి సమగ్ర సర్వే ప్రక్రియపై ఎన్యుమరేటర్లు,సూపర్వైజర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో,మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ,తహసీల్దార్ విఠల్ తదితరులు ఉన్నారు.

## మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ పద్మ శరత్ రెడ్డి..







**కరపత్రం న్యూస్,బోధన్ నవంబర్01..**
బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గల మున్సిపల్ కాంప్లెక్స్ లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళ శక్తి క్యాంటీన్ ను శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల ఆర్థిక బలపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోతూ ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మహిళల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. మహిళలు ఐక్యతగా పని చేసుకుంటూ వ్యాపారంలో ముందుకు సాగాలని, వారికి తోడ్పాటును అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. స్త్రీ శక్తి క్యాంటీన్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్బంగా ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వెంకట నారాయణ, కౌన్సిలర్లు తూము శరత్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పిట్ల సత్యం, ఇమ్రాన్, ఇంద్ర కరణ్, నాయకులు ప్రభాకర్,



మెప్మా అధికారి శ్రీనివాస్, మహిళా శక్తి క్యాంటీన్ నిర్వాహకులు, మహిళా సంఘం సభ్యులు ఉన్నారు.

## బోధన్ ఏటీసీ కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

**కరపత్రం బోధన్,నవంబర్ 01 :**
జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. బోధన్ పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ భవన సముదాయం నిర్మాణ పనులను కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు కేవలం బేస్ లెవెల్ వరకే నిర్మాణం పనులు జరగడాన్ని గమనించిన కలెక్టర్,పనుల్లో జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. వర్షపు జలాలు నిలిచి ఉండడంతో పనులు చేపట్టలేకపోయామని,ఇకపై వేగంగా పనులు చేపట్టి వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని నిర్మాణ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఐ.టీ.సీలలో తరగతులు నేటి నుండి





ప్రారంభం అయినందున భవన నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా,సొంత భవనాలు అందుబాటులోకి వచ్చే లోపు ప్రత్యామ్నాయంగా ఐ.టీ.ఐలలో ఏ.టీ.సీ తరగతులను నిర్వహించాలని అధికారులకు సూచించారు. అభ్యర్థులకు శిక్షణ కోసం కేటాయించబడిన యంత్రసామాగ్రి,ఇతర మెటీరియల్ పూర్తి స్థాయిలో వినియోగం అయ్యేలా చూడాలన్నారు. నాణ్యతతో యుద్ధప్రాతిపదికన భవన నిర్మాణ పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో,తహసీల్దార్ విఠల్,వైస్ ప్రిన్సిపాల్ సరోజినీదేవి తదితరులు ఉన్నారు.

# ఆసుపత్రిలో చేరిన కమల్‌హాసన్ సోదరుడు



బాలీవుడ్ నటి, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. తన భర్త నిక్ జొనాస్‌తో కలిసి ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్‌తో వేడుకలను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి హాలీవుడ్ స్టార్స్, ఫ్రెండ్స్‌కు ప్రత్యేకంగా పార్టీ ఇచ్చారు. లండన్‌లోని జింఖానా రెస్టారెంట్‌లో వీరు తమ ఫ్రెండ్స్‌కు ఈ పార్టీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పీసీ సంప్రదాయ చీర కట్టులో మెరిశారు. సబ్యసాచి డిజైన్ చేసిన రెడ్ శారీలో ఎంతో అందంగా కనిపించారు. నిక్ సైతం సంప్రదాయ కుర్తా ధరించి ఆకట్టుకున్నారు. పార్టీ సందర్భంగా తమ ఫ్రెండ్స్‌కు వీరు ఇండియన్ స్వీట్స్‌ను గిఫ్ట్‌గా అందించినట్లు తెలుస్తోంది. పీసీ దివాళీ పార్టీకి సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

# విజయ్ దళపతికి రజినీ అభినందనలు



తమిళ నటుడు స్టార్ విజయ్ దళపతి రాజకీయ పార్టీని స్థాపించారు. ఇటీవల తమిళగ వెట్రి కళగం పార్టీ భారీ బహిరంగ సభ నిర్వహించారు. తన పార్టీ రాజకీయాల్లో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. రాజకీయ ప్రయాణంలో, టీవీకే నిర్మాణాత్మక విమర్శలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని ప్రకటించారు. విజయ్ రాజకీయ రంగ ప్రవేశంపై సూపర్ స్టార్ రజనీకాంత్ స్పందించారు. విజయ్ రాజకీయ రంగ ప్రవేశం విజయవంతమైందని ప్రశ్నించారు. టీవీకే తొలి బహిరంగ సభను చాలాచక్కగా నిర్వహించారంటూ అభినందించారు. విజయ్ తన పార్టీ సభను ఎంతో విజయవంతంగా నిర్వహించారనన్న ఆయన.. అందుకు అభినందిస్తున్నానని చెప్పారు. అక్టోబర్ 27న విల్లుపురం జిల్లా విక్రవండిలో టీవీకే భారీ సభ నిర్వహించింది. విజయ్ అభిమానులు, మద్దతుదారులు భారీగా తరలివచ్చారు. ప్రసంగం వాడీవేడిగా సాగింది. బీజేపీ, డీఎంకే పార్టీలను తమ ప్రత్యర్థులుగా ప్రకటించారు. అలాగే, పలు పార్టీలకు స్నేహహస్తాన్ని అందించారు. 2026లో జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 234 స్థానాల్లోనూ పోటీ చేయనున్నట్లు విజయ్ ప్రకటించారు.

# సంక్రాంతికి వస్తున్నాం' అంటోన్న వెంకటేశ్

‘ఎఫ్ 2’, ‘ఎఫ్ 3’ తర్వాత హీరో వెంకటేశ్ – దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. శ్రీవేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు దీనిని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ‘సంక్రాంతికి వస్తున్నాం’ అనే పేరు ఖరారు చేసింది. 2025లో సంక్రాంతి పండుగకు దీనిని ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్నట్లు తెలిపింది. అనిల్ రావిపూడి మార్క్ ఫన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఇది సిద్ధమవుతోంది. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.‘భగవంత్ కేసరి’ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తోన్న చిత్రమిదే. ముక్కోణపు క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతోంది. ఈ సినిమాలో వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. ఇప్పటికే చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. టాకీ పార్ట్ కూడా మొదలుపెట్టేశారు. రాజేంద్రప్రసాద్, సాయికుమార్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.




**సంక్రాంతి రేసులో ఏమున్నాయి..?**

టాలీవుడ్‌లో ఈసారి సంక్రాంతి పోటీ గట్టిగానే కనిపిస్తోంది. స్టార్ హీరోల సినిమాలు పండుగ మార్కెట్‌పై దృష్టి పెట్టాయి. జనవరి 10న తాము రానున్నామని ‘గేమ్ ఛేంజర్’ టీమ్ ఇప్పటికే ప్రకటించింది. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో సినిమా కావడం.. పొలిటికల్ యాక్షన్ జానర్.. చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపిండచం వంటి అంశాలతో ఈసినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి. డిసెంబర్‌లో విడుదల కావాల్సిన ఈ చిత్రాన్ని కొన్ని కారణాలతో జనవరికి వాయిదా వేస్తున్నట్లు ఇప్పటికే దిల్ రాజు ప్రకటించిన విషయం తెలిసిందే. బాలకృష్ణ – బాబీ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న సినిమా కూడా సంక్రాంతికి రానున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థ తెలిపింది. ‘తండేల్’ కూడా పండుగకే వస్తుందని వార్తలు వస్తున్నాయి. దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

### చిరంజీవి, మహేష్ , విజయ్ దేవరకొండ ఇప్పుడు బన్నీ..

# ఐకాన్ స్టార్ చేతికి మరో బ్రాండ్..



పుష్ప 2 విడుదల తేదీ మార్చిన విషయం తెలిసిందే. పుష్ప ముందుగా డిసెంబర్ 6న రావాల్సి ఉంది. ఇప్పుడు డిసెంబర్ 5న విడుదల కానుంది. ఈ సినిమా కోసం అభిమానులంతా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా షూటింగ్ ఇంకా పూర్తి కాలేదని తెలుస్తోంది. దీంతో పాటు ‘పుష్ప 2’ డ్యాన్స్ నంబర్‌ను కూడా చిత్రీకరించాల్సి ఉంది. ఇందుకోసం బాలీవుడ్ బ్యూటీని రంగంలోకి దింపుతున్నారని గుసగుస. ఆమె ఎవరో కాదు క్రేజీ బ్యూటీ శ్రద్ధా కపూర్. ఈ అమ్మడు పుష్ప 2లో స్పెషల్ సాంగ్ చేస్తుందని అంటున్నారు. ‘పుష్ప 2’ విడుదలకు మరికొద్ది రోజులు మాత్రమే సమయం ఉంది. అయితే అల్లు అర్జున్ దాని నుండి ఒక రోజు విరామం తీసుకున్నాడని సమాచారం. ఓ యాడ్ షూట్ కోసం బన్నీ బ్రేక్ తీసుకున్నాడట.నిజానికి అల్లు అర్జున్ ఇప్పటికే పలు బ్రాండ్ ప్రమోషన్స్ లో పాల్గొన్న విషయం తెలిసిందే.. సినిమాపైనే కాకుండా ప్రమోషన్‌పైనా దృష్టి సారిస్తున్నారు. ఇక ఇప్పుడు థమ్సప్ కు అల్లు అర్జున్ బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించనున్నాడని తెలుస్తోంది. ఈ యాడ్ షూట్ కోసమే బన్నీ బ్రేక్ తీసుకున్నాడట. ఇప్పటికే థమ్సప్ కు మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ మహేష్ బాబు, అల్లు అర్జున్ బ్రాండ్ అంబాసిడర్లుగా చేశారు. ఇప్పుడు ఇది ఐకాన్ స్టార్ చేతికి వెళ్ళింది.ఈ యాడ్ ను పుష్ప సినిమా ప్రమోషన్ సందర్భంగా విడుదల చేయనున్నారు. కాగా పుష్ప 2లో శ్రద్ధా కపూర్ పాటను ఇంకా చిత్రీకరించలేదని కొన్ని రోజుల క్రితం వార్తలు వచ్చాయి. నవంబర్ 4 నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానుందని అంటున్నారు.. అందుకే దర్శకుడు సుకుమార్ సినిమా ప్రమోషన్‌లో పెద్దగా కనిపించారు అని అంటున్నారు. అల్లు అర్జున్ మాత్రమే కమాండ్ తీసుకోనున్నాడట. ఐటమ్ సాంగ్ పోస్ట్ ప్రొడక్షన్ పనులను సుకుమార్ చేయనున్నారు. దీంతో పాటు సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులపై కూడా దృష్టి పెట్టనున్నారు. ‘పుష్ప 2’లో స్టార్ యాక్టర్ వాయిస్ ఓవర్ ఉంటుందని కూడా చెబుతున్నారు. దీంతో ‘పుష్ప 3’కి హింట్ ఇస్తారని టాక్.

# రిషభ్ శెట్టికి థాంక్స్ చెప్పిన ప్రశాంత్‌వర్మ



‘శ్రీ రాముడికి హనుమంతుడు ఇచ్చిన మాట ఏమిటి?’ అనే ప్రశ్నకు సమాధానంగా తెరకెక్కుతోన్న చిత్రం ‘జై హనుమాన్’. ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో ఇది రూపుదిద్దుకుంటోంది. ఆంజనేయ స్వామి పాత్రలో కన్నడ నటుడు రిషభ్ శెట్టి కనిపించనున్నారు. దీపావళి కానుకగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేయగా దానికి విశేష ఆదరణ లభించింది. ఈనేపథ్యంలో తన ప్రాజెక్ట్‌లో భాగమైన రిషభ్ శెట్టికి ధన్యవాదాలు చెప్పారు ప్రశాంత్ వర్మ. శుక్రవారం పోస్ట్ పెట్టారు. “ఈ ప్రాజెక్ట్‌లో భాగమైన, జాతీయ అవార్డు అందుకున్న నటుడు రిషభ్ శెట్టికి ధన్యవాదాలు. హనుమాన్‌పై ఆయనకున్న భక్తి మరియు అసమానమైన అంకితభావం ఈ పాత్రకు నిజంగా జీవం పోశాయి. అద్భుతమైన పరివర్తన, పరిపూర్ణత, తిరుగులేని నిబద్ధత ‘జై హనుమాన్’ని అసాధారణమైనదిగా ఆయన మార్చారు. ప్రపంచవ్యాప్తంగా తన అభిమానులకు మరపురాని అనుభూతిని అందించడానికి ఆయన అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు. మీతో కలిసి ఈ ప్రయాణాన్ని ఆరంభించినందుకు ఆనందంగా ఉంది” అని రాసుకొచ్చారు. ఫస్ట్ లుక్ ఫొటోషూట్‌కు సంబంధించిన ఫొటోని ఆయన పంచుకున్నారు.

తేజ సజ్జా హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కించిన చిత్రం ‘హనుమాన్’. సంక్రాంతి కానుకగా ఈ ఏడాది విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. దీనికి కొనసాగింపుగా ఇప్పుడు ‘జై హనుమాన్’ సిద్ధమవుతోంది. ‘హనుమాన్’కు మించి ఈ సినిమా ఉంటుందని ఇప్పటికే దర్శకుడు చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఆంజనేయ స్వామి పాత్రలో ఎవరు నటించనున్నారనే విషయంలో ఎంతోమంది స్టార్ హీరోల పేర్లు తెరపైకి వచ్చాయి. చివరకు ఈ అవకాశం రిషభ్ శెట్టికి దక్కింది. ఇందులో తేజ సజ్జా హనుమంతు పాత్రలో కనిపించనున్నారు. మరోవైపు ‘హనుమాన్’తో ‘ప్రశాంత్ సినిమాటిక్ యూనివర్స్’ను క్రియేట్ చేశారు. ‘జై హనుమాన్’తోపాటు ‘అధీర’, ‘మహాకాళి’ కూడా అందులో భాగం కానున్నాయి.

# బాలీవుడ్‌పై రెజీనా కీలక వ్యాఖ్యలు

2019లో విడుదలైన ‘ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా’తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు నటి రెజీనా ప్రస్తుతం ఆమె దక్షిణాదితోపాటు హిందీలోనూ పలు చిత్రాలు చేస్తున్నారు. తాజాగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె బాలీవుడ్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ పరిశ్రమలోకి అడుగుపెట్టిన సమయంలో నటీనటులకు ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడారు.“దక్షిణాది నుంచి ఈ పరిశ్రమలోకి అడుగుపెట్టిన ఎంతోమంది భాషాపరమైన సమస్యలు ఎదుర్కొన్న వారే. భాష విషయంలో స్పష్టంగా లేకపోతే.. తమ ప్రాజెక్టుల్లోకి తీసుకోవడానికి ఆసక్తి చూపించరు. దక్షిణాదిలో అలా ఉండదు. హిందీ సినిమాల్లో నటించాలని నిర్ణయించుకున్నప్పుడు.. ముంబయిలోనే ఉండాలని, మీటింగ్స్‌లో పాల్గొనాలని తెలిపారు. పెద్దగా నచ్చకపోయినప్పటికీ అదే ఇక్కడ ముఖ్యమని అర్థమైంది. నాకోసం ఒక టీమ్ ఉంటుంది. అవకాశాల విషయంలో వాళ్లు నాకు సాయం చేస్తారు. నేను కేవలం ఆడిషన్లలో పాల్గొంటా” అని చెప్పారు. ఇతర చిత్ర పరిశ్రమలతో పోలిస్తే బాలీవుడ్‌లో పోటీ ఎక్కువగా ఉంటుందన్నారు.విభిన్న కథలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు రెజీనా. ఈ ఏడాది ఆమె నటించిన ‘ఉత్సవం’ విడుదలై మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ప్రస్తుతం ఆమె కోలీవుడ్‌లో తెరకెక్కుతోన్న ‘విదాముయార్చి’, ‘ఫ్లాష్‌బ్యాక్’ల్లో నటిస్తున్నారు. ‘జాట్’, ‘సెక్షన్ 108’ హిందీ ప్రాజెక్టుల కోసం పనిచేస్తున్నారు. ‘జాట్’కు గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తోన్న విషయం తెలిసిందే. ఇది చిత్రీకరణ దశలో ఉంది.

